క్లుప్తంగా

ఏఎస్సైకి సత్కారం



ఏఎస్సై సంపత్ కుమార్‌ను సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏఎస్సై ఎన్వీ సంపత్ కుమార్‌ను సత్కరించారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లకు సంబంధించి సమర్థవంతగా ఏఎస్సై పనిచేశారని, ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన అతి ఉత్కృష్ట సేవా పతకాన్ని ఎస్పీ చేతుల మీదుగా ఏఎస్సై అందుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సంతప్‌కుమార్‌ను దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ధనరాజ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ దొంతు మాధవ, పంచాయతీ రాజ్ ఏఈ విజయ్‌కుమార్, చార్టెడ్ అకౌంట్ పసుమర్తి కోటేశ్వరరావు, కంచర్ల శ్రీనివాస్, చిట్లూరి సాయి, అయ్యన్న పాల్గొన్నారు.

హామీల అమలులో మోసం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కృష్ణ చైతన్య

కామవరపుకోట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేశాయని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య విమర్శించారు. సీపీఐ కామవరపుకోట మండల 11వ మహాసభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. తొలుత బంగ్లా నుంచి గ్రోమోర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు టీవీఎస్ రాజు, కంకిపాటి బుచ్చిబాబు, జేవీ రమణ రాజు, గోలిమే బాలయేసు తదితరులు పాల్గొన్నారు.

నేడు బుట్టాయగూడెంలో యోగా దినోత్సవం

బుట్టాయగూడెం: జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉదయం 6 గంటలకు యోగా కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎంపీడీఓ కె.జ్యోతి తెలిపారు. అలాగే మండలంలోని 18 సచివాలయాల పరిధిలో కూడా ఈ యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రామ సచివాలయ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులంతా పాల్గొని అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నేడు సచివాలయాల్లో యోగాంధ్ర

టి.నరసాపురం: నేడు మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ జి.నగరాజ కుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6.30 గంటలకు నిర్వహించే యోగాకు ప్రజా ప్రతినిధులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు, ఉపాధి శ్రామికులు, విద్యార్థులు, రైతులు, వెలుగు సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశ వర్కర్లు, అన్ని శాఖల ఉద్యోగులు, టీచర్‌లు పాల్గొనాలని పేర్కొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం



దాత శ్రీనివాసరావుకు విరాళం బాండ్ పత్రం అందిస్తున్న హయగ్రీవాచార్యులు

ద్వారకాతిరుమల: స్థానిక శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి భీమడోలు మండలం పూళ్ల గ్రామానికి చెందిన పచ్చా శ్రీనివాసరావు శుక్రవారం రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. తొలుత ఆయన కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ హయగ్రీవాచార్యులు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

23న మండల పరిషత్ సమావేశం

టి.నరసాపురం: మండల పరిషత్ సమావేశం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఎంపీపీ దారబోయిన లక్ష్మి అధ్యక్షతన నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ జి.నగరాజకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరు కావాలని పేర్కొన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌కు ప్రత్యేక అధికారులు

టి.నరసాపురం: స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమ నిర్వహణకు నోడల్ అధికారులను నియమించినట్టు ఎంపీడీఓ జి.నగరాజకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను వీరు పర్యవేక్షిస్తారని, కలెక్టర్ ఉత్తర్వులు మేరకు వీరిని నియమించామని పేర్కొన్నారు. ఈ నెల 21 శనివారం ప్రత్యేక అధికారులు స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ కార్యక్రమం ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు.

ఎండొస్తే దుమ్ము.. వానొస్తే బురద

- కొయ్యలగూడెం మండలంలోని పలు రోడ్ల దుస్థితి
- రాకపోకలకు ప్రజల ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు

కొయ్యలగూడెం: ఎండ కాస్తే దుమ్ము.. వాన వస్తే బురద ఇది కొయ్యలగూడెం మండలంలోని పలు రహదారుల దుస్థితి. రోడ్లపై భారీ గోతులు ఏర్పడ్డాయి. లోడు లారీల రాకపోకల కారణంగా దుమ్ము ఎగసిపడి వాహనచోదకులు, స్థానిక నివాసితులు, పంట సాగు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తే రోడ్డు గోతుల్లో నీరు చేరి ఏది గొయ్యో, ఏది గొప్పో తెలియడంలేదు. బురదలో రాకపోకలు సాగించేందుకు నానా హైరానా పడాల్సి వస్తోంది.

ప్రజలకు అనారోగ్య సమస్యలు

పొంగుటూరు – కన్నాయిగూడెం రహదారి, శ్రీరంగపట్నం నుంచి అచ్యుతాపురంకి వెళ్లే ప్రధాన రహదారుల్లోప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పొంగుటూరు, కన్నాయిగూడెం గ్రామాల సమీపం నుంచి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణానికి స్టాక్ పాయింట్ నుంచి పొంగుటూరుకు మెటీరియల్ 50 టన్నులకు పైగా



పొంగుటూరు వద్ద ప్రధాన రహదారి దుస్థితి

లోడుతో లారీలు నిత్యం ఈ రహదారిపై పరుగులు తీస్తున్నాయి. ఈ రహదారిపై 20 కిలోమీటర్ల స్పీడ్ లిమిట్ నిబంధన ఉన్నప్పటికీ, లారీ డ్రైవర్లు పట్టించుకోవడం లేదు. ఫలితంగా రోడ్డుపై భారీ గోతులు ఏర్పడ్డాయి. లారీల వల్ల ఎగసిపడే దుమ్ము గ్రామాల్లోని ఇళ్లలో చేరి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న పంట పొలాల్లో దుమ్ముచేరి దిగుబడి తగ్గుతుందని రైతులు వాపోతున్నారు. భారీ లోడు లారీలు రాకపోకల సమయంలో దుమ్ము ఎగసిపడి వాహనచోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. దుమ్ము కారణంగా శ్వాస కోస, కంటి వ్యాధులకు గురవుతున్నామని ప్రజలు, వాహనచోదకులు వాపోతున్నారు. వర్షం వస్తే గోతుల్లో నీరు చేరి, రోడ్డుపై మట్టి కరిగి బురదలో రాకపోకలకు వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. సమస్యను ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి అనేక సార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఏంటి ఫీల్డ్ వాహనాలు అతివేగంతో వెళ్లడంతో రోడ్డుపై కుండ గోతులు ఏర్పడ్డాయి. భారీ వాహనాల రాకపోకల సమయంలో దుమ్ము ఎగసిపడకుండా రోడ్డుపై వాటరింగ్ చేయాల్సి ఉన్నా హైవే నిర్వహణ సంస్థ అమలు చేయడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



కన్నాయిగూడెం వద్ద అధ్వానంగా ఉన్న రోడ్డు

కొద్దిపాటి వర్షానికే ముంపు

కొయ్యలగూడెం మండలం శ్రీరంగపట్నం నుంచి అచ్యుతాపురానికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. కొద్దిపాటి వర్షాలకే రోడ్డు ముంపుకి గురవుతుంది. మోకాలు లోతు బురదలోనే ప్రజలు రాకపోకలు సాగించాల్సి వస్తుంది. స్కూల్‌కి వెళ్లే విద్యార్థులు స్కూల్ బ్యాగ్స్, యూనిఫాం బురదమయం కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిని అభివృద్ధి చేయడం వల్ల కొయ్యలగూడెం మండలంలోని పలు గ్రామాలతో పాటు గోపాలపురం మండలంలోని మరికొన్ని గ్రామాల రాకపోకలకు సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రజా ప్రతినిధులు స్పందించి వెంటనే రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలకు కోరుతున్నారు.



అచ్యుతాపురం శ్రీరంగపట్నం గ్రామాల మధ్య బురదలోనే రాకపోకలు సాగిస్తున్న విద్యార్థులు

రోడ్లకు మోక్షం కల్పించాలి



జేసీ ధాత్రిరెడ్డికి వినతిపత్రం అందిస్తున్న సామాజిక కార్యకర్త నాసర్ పాషా

టి.నరసాపురం: చింతలపూడి–టి.నరసాపురం ప్రధాన రహదారితో పాటు టి.నరసాపురం మండలంలోని రోడ్లకు మోక్షం కల్పించాలని సామాజిక కార్యకర్త ఎస్‌డీ నాసర్ పాషా కోరారు. ఈ మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డికి శుక్రవారం ఆయన వినతిపత్రం అందజేశారు. చింతలపూడి నుంచి టి.నరసాపురం వరకు కలిపే ప్రధాన రహదారిపై గుంతలు ఏర్పడి ధ్వంసమైందని, దీంతో రాకపోకలకు వాహనదారులు తీవ్ర అసౌకర్యం కలుగుతుందని తెలిపారు. వీలైనంత త్వరగా రోడ్డు వెడల్పు చేయాలని కోరారు. టి.నరసాపురం అంబేడ్కర్ సెంటర్ నుంచి సినిమా హాల్ సెంటర్ వరకు పంట కాలువను తలపించే విధంగా రోడ్లపైనే నీరు నిలబడుతుందని వివరించారు. డ్రెయినేజీ సరిగా లేకపోవడం, రోడ్డు పల్లంగా ఉండటంతో సమస్య ఏర్పడిందని తెలిపారు. గండిగూడెం, మక్కినవారిగూడెం, లక్ష్మీపురం రోడ్లను కూడా అభివృద్ధి చేయాలని పాషా కోరారు.

నూకాలమ్మవారికి వెండి సమర్పణ



అమ్మవారి వస్త్రానికి వెండిని అందిస్తున్న దాతలు

జంగారెడ్డిగూడెం: స్థానిక నూకాలమ్మవారికి శుక్రవారం సందర్భంగా ఆలయంలో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి వెండి చీర తయారీకి ఇనగడపు రమేష్ కుమార్, ధనలక్ష్మి కుటుంబ సభ్యులు 5 తులాల వెండిని అందజేశారని ఆలయ శాశ్వత చైర్మన్ రాజాన సత్యనారాయణ తెలిపారు. శ్రీ నూకాంబిక ప్రసాద వితరణ భక్త బృందం చిట్లూరి సుబ్బారావు నేతృత్వంలో కట్టుపొంగలి, పులిహోర ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కొమ్మినేని వెంకట రమణ, మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి, వీవీఎస్ రామారావు, వేముల శ్రీనివాసరావు, అరుణ దంపతులు, వేముల యశ్వంత్, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

జ్ఞాన సరస్వతికి పూజలు



జ్ఞాన సరస్వతికి పూజ చేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: మండలంలోని గుర్వాయిగూడెం శ్రీ అయ్యప్పస్వామి ఉపాలయమైన శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు చేశారు. అమ్మవారికి పంచామృతాలతో అభిషేకించి ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకోగా, ఆలయ కమిటీ తీర్థప్రసాదాలను అందజేసింది.

చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్ట్ అక్రమం



బొడ్డు వెంకటేశ్వరరావు

చింతలపూడి : చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని వైఎస్సార్ సీపీ మున్సిపల్ విభాగం జిల్లా అధ్యక్షుడు బొడ్డు వెంకటేశ్వరరావు శుక్రవారం చింతలపూడిలో ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులను లక్ష్యంగా చేసుకొని అక్రమ కేసులు పెట్టి వేధిస్తోందని దుయ్యబట్టారు. రాజకీయ కక్షతోనే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని, మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని అరెస్టు చేశారని వివరించారు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను డైవర్ట్ చేయడానికి ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా కూటమి పాలనలో మహిళలకు భద్రత కరువైందన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి వస్తోన్న ప్రజాదరణను తట్టుకోలేక ఆయన పర్యటనలను కూడా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. పోలీసు ఆంక్షలు విధించి ఒక పార్టీ అధ్యక్షుడిని పర్యటించకుండా అడ్డుకోవడం సరి కాదని అన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, తగిన సమయంలో తగిన విధంగా బుద్ధి చెప్తారని కూటమి నాయకులను హెచ్చరించారు.

కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను విడనాడాలి



ధర్నా నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులు

చింతలపూడి : కూటమి ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగుల వ్యతిరేక విధానాలను విడనాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్‌వీఎస్ నారాయణ డిమాండ్ చేశారు. ఇటీవల కూటమి ప్రభుత్వం కార్మికులు ఉద్యోగుల పని గంటల పెంపు, మహిళా ఉద్యోగ కార్మికులు రాత్రి సమయాల్లో పనిచేసే విధానాన్ని అమలుచేస్తూ నిర్ణయించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఎన్నో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని, మహిళల భద్రత చట్టాలను పక్కనపెట్టి పెట్టుబడిదారులకు, పారిశ్రామికవేత్తలకు లాభం చేకూర్చే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడాన్ని నిరసిస్తూ స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎస్ సరోజిని, టి.మాణిక్యం, జి.సరళ దేవి, కె.కవిత, ఎం అరుణ కుమారి, వై.సీతామహాలక్ష్మి, పలు మహిళా సంఘాల కార్మికులు పాల్గొన్నారు.

అధికారులపై 'మట్టి ముఠా' ఒత్తిళ్లు



జలవనరుల శాఖ సబ్ డివిజన్ కార్యాలయం

కొయ్యలగూడెం: నైరుతి ప్రవేశించి పక్షం రోజులు గడుస్తున్నా వరుణదేవుడు చిరుజల్లులతో సరిపెడుతుండడంతో వర్షాల కోసం ఎదురుచూడడం అన్నదాతలకు పరిపాటి. అయితే అధికారులు వానల కోసం కరుణించవా వరుణదేవా అంటూ ఎదురు చూస్తుండడం గమనార్హం. నాలుగు నియోజకవర్గాల పరిధిలోని సేవలకు విస్తరించి ఉన్న జలవనరుల శాఖ కొయ్యలగూడెం సబ్ డివిజన్ కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది వరుణ జపం ప్రారంభించారు. ప్రజలు లేదా రైతాంగం కోసం కాదు.. చెరువుల్లో సమృద్ధిగా నీరు వస్తేనే మట్టి అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడుతుందనేది వారి ఆకాంక్ష. ఇరిగేషన్ శాఖ (పీడబ్ల్యూడి) పరిధిలోని ఉన్న దాదాపు 150కి పైగా చెరువుల్లో సగానికి పైగా చెరువుల నుంచి గత నెలన్నర రోజులుగా యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా దందా నడుస్తోంది. ఇదంతా రాజకీయ, ప్రజాప్రతినిధుల కను సన్నల్లోనే కొనసాగుతుండడంతో ఇరిగేషన్ శాఖ అధికారులు అచేతనంగా మారారు. ఈనెల 19వ తేదీ రాత్రి భారీ స్థాయిలో మెట్ట ప్రాంతంలోని పలు చెరువుల నుంచి మట్టి అక్రమ రవాణాకు దళారులు సిద్ధమయ్యారు. లోకల్‌గా ఉన్న టిప్పర్లు, క్రషర్ ప్రాంతాల టిప్పర్లను వారం రోజులపాటు లీజుకు తీసుకున్నారు. విషయం జిల్లాలోని ఉన్నతాధికారులకు చేరడంతో విజిలెన్స్ దాడులు చేసే ప్రమాదం ఉందని అక్రమ రవాణాను అక్రమార్కులు తాత్కాలికంగా వాయిదా వేశారు. అయితే ఇప్పటికే టిప్పర్లకు అడ్వాన్సులను చెల్లించామని, కమర్షియల్ అవసరాలకు మట్టి రవాణా చేయకపోతే లక్షల్లో నష్టపోతామని రాజకీయ పెద్దలను ఆశ్రయించినట్లు తెలిసింది. దీంతో మట్టి రవాణా నిరోధకానికి సంబంధించి ముడిపడి ఉన్న వివిధ ప్రభుత్వ శాఖల అధికారులపై తీవ్రమైన ఒత్తిడి కొనసాగుతోందని సమాచారం. ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు మధ్య పోక చెక్కలా నలిగిపోతున్నామని స్థానిక అధికారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో తమను రక్షించగలిగేది వానదేవుడే అంటూ ఆకాశం వైపు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

నేడు యోగాంధ్రకు సర్వం సిద్ధం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా స్థానిక సర్ సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో ఈనెల 21వ తేదీన నిర్వహించే యోగాంధ్ర జిల్లాస్థాయి కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కళాశాలలో శనివారం ఉదయం 6.30 నుంచి 8.00 గంటల వరకు 5 వేల మందితో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఏలూరు నగరంలోని ఇండోర్ స్టేడియం, అల్లూరి సీతారామరాజు స్టేడియంలో కూడా యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. సుమారు 9 లక్షల మందితో జిల్లా వ్యాప్తంగా వార్డు, సచివాలయాల పరిధిలో శనివారం ఉదయం యోగా ప్రదర్శనలు నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం అన్నిఏర్పాటు పూర్తిచేసిందని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్‌డీఓ అచ్యుత అంబరీష్, మున్సిపల్ కమిషనరు ఎ.భాను ప్రతాప్, డీఈఓ వెంకటలక్ష్మమ్మ ఉన్నారు.

యోగాంధ్ర ర్యాలీ

కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం యోగా ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ప్రిన్సిపాల్ జి.గిరిబాబు ప్రారంభించారు. కళాశాల ప్రాంగణం నుంచి కల్యాణ మండపం చౌరస్తా వరకు ర్యాలీ చేశారు. వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, యోగా దినోత్సవ కళాశాల ఇన్‌చార్జి దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ పీఓ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో రెవెన్యూ శాఖ పాత్ర కీలకం



బుట్టాయగూడెంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చలపతిరావు



జంగారెడ్డిగూడెం తహసీల్దార్ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న కమిషనర్ రమణ



వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ డే నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది

బుట్టాయగూడెం: ప్రజాస్వామ్యంలో రెవెన్యూశాఖ అత్యంత కీలకమని, ప్రతి ఉద్యోగి రోజురోజుకూ విజ్ఞానాన్ని పెంపొందించుకుని విధులు నిర్వహిస్తే అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని తహసీల్దార్ పీవీ చలపతిరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సమాజంలో ఏ సంక్షోభం ఎదురైనా తొలుత రెవెన్యూశాఖ స్పందించి వాటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయడం జరుగుతుందన్నారు. బ్రిటిష్ పాలనా కాలంలోనే రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటైందన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రమేష్, సీనియర్ అసిస్టెంట్ గంగరాజు, వీఆర్‌ఓలు, సిబ్బంది, పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

వేలేరుపాడు: ప్రజలకు సేవలు అందించడంతో ప్రతి ఉద్యోగి చిత్తశుద్ధితో పనిచేయాలని తహసీల్దార్ డీవీ సత్యనారాయణ అన్నారు. వేలేరుపాడు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని, గ్రామ రెవెన్యూ అధికారి ప్రజలకు, రైతులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సత్యనారాయణ ఆదేశించారు. అధికారులు, సిబ్బందికి ఆయన రెవెన్యూ డే శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేవల్లో ముందుండాలి

జంగారెడ్డిగూడెం: ప్రజలకు సేవలు అందించడంలో మిగిలిన శాఖల కన్నా రెవెన్యూ ముందుండాలని తహసీల్దార్ కె.స్లీవజోజి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ డే నిర్వహించారు. ప్రతి రెవెన్యూ ఉద్యోగి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రెవెన్యూ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిపాలిటీ కమిషనర్ కేవీ రమణ కేక్ కటింగ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ నాయకులు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ కె.రమేష్, కార్యాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు, సహాయకులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో..

ద్వారకాతిరుమల: స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ జీవీ సుబ్బారావు రెవెన్యూ శాఖ చరిత్ర, విశిష్టతను వివరించారు. డిప్యూటీ తహసీల్దార్ బి.దుర్గా మహాలక్ష్మి మాట్లాడారు. ఏఓ ఎ.దుర్గా రమేష్ వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

స్పందించిన విద్యుత్ శాఖ

ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తుప్పల తొలగింపు

సాక్షి స్పందన



ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న మొక్కలను తొలగిస్తున్న సిబ్బంది

కామవరపుకోట: పొంచి ఉన్న ప్రమాదం శీర్షికన సాక్షిలో శుక్రవారం ప్రచురితమైన వార్తకు విద్యుత్ అధికారులు స్పందించారు. స్థానిక కొత్తూరులో బస్టాండ్‌ను ఆనుకుని ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఉన్న మొక్కలను తొలగించారు. పంచాయతీ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆనుకుని ఉన్న పగిలిన పంచాయతీ మంచినీరు పైపుకు మరమ్మతులు చేయాల్సి ఉంది. నీటి లీకేజీని వెంటనే అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ట్రాన్స్‌పోర్టు కూలి రేట్లు పెంచాలి



ప్రదర్శన చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

ఏలూరు (టూటౌన్): ఏలూరు నగరంలో పచారీ షాపుల్లో పనిచేస్తున్న ఐఎఫ్‌టీయూ, ఏఐటీయూసీ సంఘాల కార్మికులు లోడింగ్ అన్లోడింగ్ ట్రాన్స్పోర్ట్ కూలి రేట్లు పెంచాలని కోరుతూ శుక్రవారం ప్రదర్శన, ధర్నా చేశారు. వైఎంహెచ్ ఏ హాల్ సెంటర్ నుంచి ర్యాలీగా బయలుదేరి ఎన్ఎస్ హోల్‌సేల్ మార్కెట్ మీదుగా బిర్లా భవన్ సెంటర్ నుంచి మర్చంట్ చాంబర్ నాయకులు బాలకృష్ణ షాపు వద్ద, బుర్రంశెట్టి బ్రహ్మయ్య షాపు వద్ద, చాంబర్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల రాజేంద్ర బాబు షాపు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ అనుబంధ జట్టు కార్మిక సంఘం కార్యదర్శి గడసాల రాంబాబు మాట్లాడుతూ 50 ఏళ్ల నుంచి సాంప్రదాయంగా వస్తోన్న రెండేళ్లకోసరా కూలి రేట్ల ఒప్పంద పెంపుదల కాలపరిమితి ఏప్రిల్ 9వ తేదీతో ముగిసినా యజమానుల నుంచి స్పందన లేకపోవడం సరైనది కాదని చెప్పారు. తక్షణం చర్చలు నిర్వహించి, కూలి రేట్లు పెంచాలని యజమానులను కోరారు. ఏఐటీయూసీ అనుబంధ లాగుడు తోపుడు బండ్ల సంఘం ప్రెసిడెంట్ పుప్పాల కన్నబాబు మాట్లాడుతూ హమాలీల కులి రేట్ల పెంపదల విషయంలో జాప్యం తగదన్నారు. ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు, ఐఎఫ్‌టీయూ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు, ఏఐటీయూసీ ఏలూరు కార్యదర్శి ఎ.అప్పలరాజు, సంఘీభావంగా ఇఫ్టూ జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దా వెంకట్రావు, ఏఐటీయూసీ ఏలూరు నగర అధ్యక్షుడు కె.కృష్ణమాచార్యులు మాట్లాడారు.

ఇద్దరిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: వ్యక్తిని కొట్టి గాయపరిచిన నేరానికి ఇద్దరిపై కేసు నమోదు చేశామని హెచ్‌సీ టి.బాబూరావు తెలిపారు. కుటుంబ కలహాల నేపథ్యంలో జంగారెడ్డిగూడెం మండలం కేతవరం గ్రామానికి చెందిన భార్యా భర్తలు మల్లెల్లి మోహన్, రాటాలు నాలుగేళ్లుగా విడిగా ఉంటున్నారు. ఈ నెల 19న పెద్దల సమక్షంలో మాట్లాడుకునేందుకు జంగారెడ్డిగూడెం ఎంఆర్‌పీఎస్ కార్యాలయంలో సమావేశమయ్యారు. మోహన్ తరుపు పెద్దలు డోలా రామయ్య, మరికొందరు ఎంఆర్‌పీఎస్ కార్యాలయానికి వచ్చారు. అక్కడికి వచ్చిన రాటాలు, ఆమె వెంట వచ్చిన ఉండి రమేష్‌లు ఒక్కసారిగా రామయ్యపై దాడి చేశారు. దీంతో రామయ్యకు రక్త గాయాలయ్యాయి. అక్కడే ఉన్న వారు వీరిని అడ్డుకుని రామయ్యను ఏరియా ఆసుపత్రికి తరలించారు. రామయ్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.